

సమష్టి కృషితో మెరుగైన పోలీసింగ్


ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఈజీ అశోక్‌కుమార్

- రూరల్ పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తాం
- నూతన ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు స్థాయి నుంచి అందరం సమష్టిగా పనిచేసి మెరుగైన పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ అవుతామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా నూతన ఎస్పీగా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా పోలీసు కార్యాలయం లో పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. కడప జిల్లాకు ఎస్పీగా రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతపురం జిల్లా నార్పల తమ స్వగ్రామమని అన్నారు. తాను 2010లో గ్రూప్-1 పరీక్ష ద్వారా డీఎస్పీగా ఎంపికైన తరువాత వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించానన్నారు. అందులో భాగంగా 2014 సంవత్సరం నుంచి 2017వ సంవత్సరం వరకు కడప డీఎస్పీగా పనిచేశానన్నారు. తిరిగి ఇక్కడకు ఎస్పీగా రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో మహిళలు, చిన్నారుల పట్ల అఘాయిత్యాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఎస్పీ కార్యాలయానికి రావడానికి ఎలాంటి సంకోచానికి గురికావలసిన పనిలేదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి మరింత కృషి చేస్తామన్నారు. రూరల్ పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. మేధావులు, మీడియా, ప్రజల భాగస్వామ్యంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అందిస్తామన్నారు. తప్పు చేసిన వారికి, తప్పు చేయని వారికి మధ్య తేడా ఏంటో చెప్పేలా పోలీసింగ్ ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌కు అనుసంధానం చేస్తామన్నారు.

పోలీసు ప్రతిష్ఠ పెంచేలా విధులు నిర్వర్తించాలి

జిల్లా పోలీసుశాఖ ప్రతిష్ఠ పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు నగరంలోని ఎస్‌ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఓ వైపు ప్రజలకు చేరువయ్యేలా ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ మరో వైపు అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగు కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ప్రకాశ్‌బాబు (అడ్మిన్), బి.రమణయ్య (ఏఆర్) పాల్గొన్నారు.

స్వంత భూముల్లో మట్టి తవ్వకాలు జరపాలన్నా బోర్లు వేసుకోవాలన్నా రెవెన్యూ అనుమతులు తీసుకోవాలి. లేదంటే వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తారు. అలాంటిది జిల్లాకు ఉన్న ఏకైక పెద్ద నది పెన్నాలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అడ్డంగా ఇసుకను దోచేసి గుల్ల చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో ఎక్కడ పడితే అక్కడ విలువైన ఇసుక వనరు విచ్చలవిడిగా తరలిపోతోంది. అందరూ ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో నదులన్నీ ఇసుక వనరు లేకుండా ఖాళీ అవుతున్నాయి. ఇది ఆ నదీ తీరాల్లో ఉన్న పట్టణాలు, గ్రామాలకు తీవ్ర తాగునీటి ఇక్కట్లతో పాటు భవిష్యత్తు అవసరాలకు ఇసుక లేకుండా మాయం చేస్తుంది. దీనిపై ప్రజలు, మేధావులు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


వాటర్ వర్క్స్ వద్ద ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న దృశ్యం

ఇసుకాసురుల విధ్వంసం

- మున్సిపల్ హెడ్‌వాటర్‌వర్క్స్ సమీపంలో..
- పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు
- రైల్వే వంతెన కింద సైతం వదలని అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు
- లక్షల జనాభా తాగునీటి వసతికి పొంచి ఉన్న ముప్పు


రైల్వే వంతెన కింద ఇసుక తవ్వకాలు జరిపిన దృశ్యం

ప్రొద్దుటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంతో పాటు పక్క నియోజకవర్గాలకు తాగునీటి సదుపాయానికి ఉన్న ఏకైక నీటి వనరు పెన్నానది. పదేళ్ల క్రితం నుంచే ప్రొద్దుటూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు మైనింగ్ అండ్ జియాలజీ విభాగం అధికారులతో పాటు కలెక్టర్ అనుమతులు ఇవ్వలేదు. కారణం ఇక్కడ పెన్నానదిలో అప్పటికే డెంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఇక్కడ ఇసుక తవ్వకాలు జరిపితే లక్షలాది మంది తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు అడ్డుకుంటూ వచ్చారు. ఐతే గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు తాము మాత్రమే తవ్వకాలు జరిపి ఇతరులను ఎవ్వరిని పెన్నానదిలోకి దిగనీయకుండా ఇసుక అక్రమ రవాణా సాగించారు. దీంతో వందల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారు. చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజలందరికి అందుబాటులోకి వచ్చే ఇసుక విధానం తెస్తుందని అనుకుంటే.. ఉచిత ఇసుక విధానం పేరుతో ఎక్కడా ఎలాంటి నిబంధనలు పెట్టకుండా పూర్తిగా గేట్లు ఎత్తేసింది. దీంతో ప్రొద్దుటూరు పెన్నానదిలోని హెడ్ వాటర్ వర్క్స్ వద్దనే ఇసుక నిల్వలు లేకుండా నదిని గుల్ల చేసేస్తున్నారు. ఆఖరికి రైల్వే వంతెన దగ్గర కూడా అడ్డంగా ఇసుక తవ్వకాలు జరిపి రైల్వే వంతెన కూలిపోయేలా ప్రమాద పరిస్థితులు సృష్టిస్తున్నారు. ఈ మూడునెలల్లోనే పెన్నా నది పెద్ద ఎత్తున విధ్వంసం అవుతున్నా రెవెన్యూ మైనింగ్ పోలీసు ఆఖరికి మున్సిపాలిటీ వాళ్లు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పెన్నాలో ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకుంటాం..

ప్రొద్దుటూరులో లక్షలాది మంది ప్రజలకు తాగునీటికి ఉన్న ఏకైక ఆధారం పెన్నా రివర్ బెడ్. ఇందులో ఇసుక అక్రమ తవ్వకాలు జరపడం వలన పట్టణ ప్రజలు తీవ్ర తాగునీటి దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. అందువల్ల రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో తాగునీటి బోర్లకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ పోలీసు అధికారుల సహకారంతో ఇసుక తవ్వకాలను అడ్డుకుంటాం. వారిపై కేసులకు సైతం వెనకాడం.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

ఉచిత ఇసుకపై ప్రభుత్వం సమీక్షించాలి..

ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉంది. దీనిని ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎక్కడ పడితే అక్కడ నదులల్లో తవ్వకాలు జరిపి రవాణా చేయడం తో ఇసుక మాయమైపోతోంది. దీంతో పర్యావరణంమీద తీవ్ర ప్రభావం పడుతోంది. పెన్నానదిలో ఇసుక తిన్నెలు తవ్వి తరలించేస్తే.. జలాశయాల నుంచి నీళ్లు నదిలోకి వదిలినా అవి భూమిలోకి ఇంకవు. తద్వారా భూగర్భ జలాల మట్టం పడిపోతుంది. ఇది చాలా ప్రమాదకరం. భూతాపాలను సైతం పెంచుతుంది.

- పి.వరలక్ష్మి, పర్యావరణ కార్యకర్త

ఇసుక రీచ్‌లకు అనుమతులు లేవు..

పెన్నా నదిలో రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద, రైల్వే వంతెన వద్ద ఇసుక తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్లతో తరలిస్తున్నారని మాకు సమాచారం వచ్చింది. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంలో నిబంధనలు సరిగా లేవు. అందువల్ల చర్యలు తీసుకోలేకపోతున్నాం. గతంలో ప్రొద్దుటూరు మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌లకు అనుమతులు లేవు. మైనింగ్ అండ్ జియాలజీ విభాగం అధికారులతో మాట్లాడుతాం. ప్రొద్దుటూరు పరిసరాల్లో పెన్నాలో ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం.

- వండాడి గంగయ్య, తహశీల్దారు, ప్రొద్దుటూరు

గీత కులాలకు మద్యం షాపుల కేటాయింపు

కడప కలెక్టరేట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో షాపుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-26 సంవత్సరానికి సంబంధించి మద్యం షాపులను గీత కులాలకు పారదర్శకంగా కేటాయించామన్నారు. జిల్లాలో ఈడిగ, గౌడ్, గౌండ్ల, గౌడ నాలుగు గీత కులాలకు 14 షాపులను ఎంపిక చేశామన్నారు. ఇందులో మైదుకూరు మున్సిపాలిటీ ఈడిగ, వేముల మండలం గౌడ్, వల్లూరు ఈడిగ, పెద్దముడియం గౌడ్, పులివెందుల మున్సిపాలిటీకి గౌడ్, కాశినాయన మండలం ఈడిగ, ప్రొద్దుటూరు ఈడిగ, బద్వేలు మున్సిపాలిటీకి ఈడిగ, ప్రొద్దుటూరు రూరల్ ఈడిగ, ఖాజీపేటకు గౌడ్, చక్రాయపేటకు ఈడిగ, కడప మున్సిపాలిటీకి ఈడిగ, వీఎన్‌పల్లికి ఈడిగ, సీకేదిన్నె మండలానికి గౌడ్ కులాలకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు ఇవ్వాలని, 6 వతేదీన దరఖాస్తుల పరిశీలన, 7వ తేదీన లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ కృష్ణ కుమార్, బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

డీటీసీలో కామపిశాచిపై వేటు

కడప, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కడప రవాణా శాఖలో కామాంధుడిపై ఎట్టకేలకు ప్రభుత్వం వేటు వేసింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. కడప రవాణాశాఖలో కీచక అధికారిపై వేటు, కేంద్ర కార్యాలయంలో సరెండర్ చేశామంటూ శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇక లైంగిక వేధింపులకు గురైన మహిళా అధికారితో మంత్రి ఫోనులో మాట్లాడి అండగా ఉంటామని, ఇప్పటికే నిందితుడిపై చర్యలు తీసుకున్నామని శిక్షపడేలా చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి స్టోరీ

నిందితుడి పేరు లేకుండా..

ఆరోపణలు ఎదుర్కొంటున్న రవాణాశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేరు లేకుండా.. కీచక అధికారిపై చర్యలు తీసుకున్నామంటూ మంత్రి ప్రకటన విడుదల చేయడం విమర్శలకు తావిచ్చింది. బాధితురాలి పేరును వెల్లడించరాదు కానీ.. నిందితుడి పేరు ఎందుకు చెప్పలేదని పులువురు ప్రశ్నిస్తున్నారు. ఓహో వాళ్ల వాళ్ల ఒకటే.. ముందుగానే ఆంధ్రజ్యోతి చెప్పింది అంటూ జనం చెప్పుకొంటున్నారు.

ఆడపిల్లల చదువుతోనే ప్రగతి : కలెక్టర్

కడప కలెక్టరేట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదువుతోనే అన్నిరంగాల్లో ప్రగతి సాధించగలరని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ కడప ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ రోహిణీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య చాలా ముఖ్యమన్నారు. చదువుకుంటే పురుషులకు ధీటుగా ప్రతిరంగంలో ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. మనోధైర్యం ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. కొందరు ఇప్పటికీ లింగ వివక్షకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు విద్య, ఆరోగ్యం, రక్షణ వంటి వాటిపై శ్రద్ధ వహించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో బాలురను భాగస్వామ్యం చేయడం వలన బాలికల ఔన్నత్యం వారికీ తెలుస్తుందన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తాం

- డీటీసీని హెడ్ ఆఫీసులో సరెండర్ చేశాం
- జేటీసీ క్రిష్ణవేణి


మాట్లాడుతున్న జేటీసీ క్రిష్ణవేణి

సీకేదిన్నె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డీటీసీ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తామని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.క్రిష్ణవేణి తెలిపారు. మహిళా ఉద్యోగిపై వేధింపులకు పాల్పడిన జిల్లా అధికారి ఘటనపై స్థానిక ఉప రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి మహిళా ఉద్యోగిపై అసభ్యంగా ప్రవర్తించిన తీరు దురదృష్టకరమని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపడుతామన్నారు. సదరు ఉన్నతాధికారి గురువారం వాకింగ్‌కు వచ్చిన సమయంలో మహిళా ఉద్యోగిని ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె తన భర్తకు తెలియజేసిందన్నారు. దీంతో ఆమె భర్త ఉపరవాణా కార్యాలయానికి వచ్చి నిలదీయడంతో భార్యాభర్తలకు డీటీసీ సమాధానం చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపామని అలాగే కార్యాలయంలో సీసీ ఫుటేజీని పరిశీలించామన్నారు. మహిళా ఉద్యోగులకు వేధింపులు లేకుండా చూస్తామని, ఉన్నతాధికారుల నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. చంద్రశేఖర్‌రెడ్డిని హెడ్ ఆఫీసులో సరెండర్ చేశామన్నారు. డీటీసీ లేకపోవడంతో ప్రొద్దుటూరు ఆర్టీవో మురళీకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మురళీకృష్ణ, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ కుంభకోణంపై విచారణ
చివరి దశకు

- వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
- ప్రాథమిక విచారణలో రూ.38 కోట్లు గోల్‌మాల్
- పునర్విచారణలో రూ.44 లక్షలకు కుదింపు
- ముగ్గురు విశ్రాంత హౌసింగ్ ఇంజనీర్లపై చర్యలకు రంగం సిద్ధం

6



వైసీపీతో.. విద్యారంగం అస్తవ్యస్తం

- పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం
- జీఓ 117 ఉపసంహరించుకుంటూ మార్గదర్శకాలు విడుదల
- లాభనష్టాలపై అధికారులతో చర్చ
- నేడు జోనల్‌స్థాయి సమావేశం
- హాజరుకానున్న పాఠశాల విద్య కమిషనర్

నాడు-నేడు, విద్యాదీవెన వంటి పథకాలతో పాఠశాల విద్య పురోగతి సాధించిందని వైసీపీ పాలకులు చెప్పిన గొప్పలు క్షేత్రస్థాయిలో బూటకమని తేలిపోయాయి. దేశంలో మరెక్కడా లేని విధంగా మూడు, నాలుగు, ఐదు తరగతులకు సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం కోసం తెచ్చిన జీఓ నెంబర్ 117తో ప్రాథమిక పాఠశాలలు కుదేలయ్యాయి. మూడేళ్ల క్రితం తీసుకువచ్చిన ఈ జీఓ రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రద్దు చేస్తే ఏర్పడే గందరగోళం నివారించేందుకు, పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం తేవాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ మేరకు సంసిద్ధత మార్గదర్శకాలను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. దీనిపై కడపలో శనివారం జోనల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ హాజరుకానున్నారు.



కడప ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా విధానంలో.. మోడల్, బేసిక్, ఫౌండేషన్ ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలుగా పాఠశాల విద్యను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్యను బట్టి స్టాఫ్ ప్యాటర్న్ తాజా నిబంధనల ప్రకారం తయారు చేయడంతో పాటు, జిల్లా మొత్తం 47 కేటగిరీలకు సంబంధించిన టీచింగ్ పోస్టుల వివరలు మంజూరైనవి, పని చేస్తున్నవి, మిగులు, అవసరం, డీఎస్సీ కోటా... పాఠశాలల యాజమాన్యం వారీగా లెక్కింపును తేల్చనున్నారు. వివరాలు పాత, కొత్త జిల్లాల వారీగా నిర్ణయిస్తారు. దీనితో ప్రతి జిల్లాలో ఏర్పడబోయే కొత్త రకం పాఠశాలలు, మిగులు సిబ్బంది లెక్క తేలనుంది. ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల అవసరముండగా, హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లు మిగులు జిల్లాల్లో దాదాపు 800కి దగ్గరగా ఉండే అవకాశం ఉంది. దీనితో హైస్కూల్ వ్యవస్థ అతలాకుతలం కానుంది. ప్రస్తుతం 3, 4, 5 తరగతులకు సబ్జెక్టు వారీగా ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. తిరిగి ఈ తరగతులు ప్రాథమిక పాఠశాలలకు బదలాయిస్తే 2025-26 విద్యా సంవత్సరం నుంచి అన్ని సబ్జెక్టులకు కలిపి ఒకరు లేదా ఇద్దరు ఎస్జీటీ టీచర్లు బోధిస్తారు. దీనితో సబ్జెక్టు నిపుణుల విద్యాబోధన ప్రాథమిక తరగతులకు అందదు. ఇక్కడ సబ్జెక్టు టీచర్లను నియమిస్తేనే తప్ప విద్యార్థులకు న్యాయం జరగదు.

అంతా గందరగోళం

ఇక ఖాజీపేట మండలంలోని ఒక ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం జీఓ 117 ప్రకారం మూడు నుంచి పదవ తరగతి వరకు ఎనిమిది సెక్షన్లు నడుస్తున్నాయి. ఇక్కడ ప్రతి సబ్జెక్టుకు ఒక్కొక్కరు చొప్పున, గణితం, ఇంగ్లీష్‌కు ఇద్దరు చొప్పున స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. జీఓ 117 రద్దు చేయడంతో.. 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపిస్తే ఐదు సెక్షన్లు మిగులుతాయి. దీనితో ఒక గణిత, ఒక ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లతో పాటు అదనంగా ఉన్న సోషియల్, తెలుగు మిగులు అవుతారు. సదరు పాఠశాలలో మొత్తం నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తరలిపోతున్నాయి. ఇలానే మూతపడుతున్న ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి అనేక మంది స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను మిగులుగా గుర్తించనున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 3నుంచి 10వ తరగతి వరకు 170 మంది చదువుతున్నారు. 3, 4, 5 తరగతులు వెళ్లిపోతే 134 మంది ఉన్నత పాఠశాలలో మిగులుతారు. ఇలా జిల్లాలో ప్రతి పాఠశాలలోను మిగులు సిబ్బందే కనిపిస్తున్నారు. వీరిని సర్దుబాటు చేసేందుకు అవసరమన్న పాఠశాలలు కనుచూపుమేరలో కనిపించడం లేదు.

కలసపాడు మండలం తెల్లపాడు గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల తాజా గణాంకాలతో అప్‌గ్రేడ్ బదులు డౌన్ గ్రేడ్ అయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు మంగళం పాడే అవకాశం ఉంది. ఇది పురోభివృద్ధా, తిరోభివృద్ధా విద్యాశాఖే తేల్చుకోవాలి. ఇలాంటి పాఠశాలలు రాష్ట్రంలో అనేకం ఉన్నా యి. యూపీలు కొనసాగించే పరిస్థితి ఉంటే ఇక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను తొలగించి ఎస్జీటీలను నియమిస్తారట.. ఇదెక్కడి న్యాయమని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెరిగే అవకాశం

పాఠశాలలను వికేంద్రీకరణ చేయడం వల్ల తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారు. దీనితో విద్యార్థులకు సంపూర్ణ విద్యాబోధన జరిగి అభ్యసన సామర్థ్యాలు పెరిగే అవకాశం ఉంది. పాఠశాల లేని ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, జనాభా తక్కువ ఉన్న గ్రామాల విద్యార్థులకు రవాణా బత్యాన్ని కూడా ప్రభుత్వం ఇవ్వనుంది. దీనితో మోడల్ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అయి ప్రాథమిక స్థాయి విద్యావిధానంలో మౌలికపరమైన మార్పులు వచ్చే అవకాశం ఉందని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు ప్రస్తుత తరుణంలో అవసరమని ప్రశంసిస్తున్నారు.

నేడు జోనల్ స్థాయి సమావేశం

కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి జోనల్‌స్థాయి సమీక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు హాజరుకానున్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు ఉప విద్యాధికారులు డీఈఓలు, ఆర్జేడీ హాజరుకానున్నారు.



స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి..



ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి. జీఓ 117 రద్దు చేస్తున్నందున పూర్వపు వ్యవస్థ పునరుద్ధరించి తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. మూయని యూపీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలి. వారానికి పది పీరియడ్లు గణితానికి కేటాయించాలి. 3, 4, 5 తరగతులకు సబ్జెక్టు టీచర్లను కొనసాగించాలి. క్లస్టర్ మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలి.. తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టని పక్షంలో జీఓ 117 రద్దు వల్ల హైస్కూల్ టీచర్లకు అన్యాయం జరుగుతుంది.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి

వేలం ద్వారా రూ.19.88 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తంబళ్లపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి దేవస్థానానికి సంబంధించిన వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి నిర్వహించిన వేలం ద్వారా రూ.19,88,000లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. శుక్రవారం మల్లయ్యకొండ పైన ఆలయం వద్ద కూటమి నాయకులు, ఆలయ ఈవో, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో హక్కులు పొందిన వారికి 2025 ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు హక్కులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు, ఉత్తమ్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహన కార్యదర్శి సోముశేఖర్, ఆనందనాయుడు, సుధాకర్‌రెడ్డి, ఆదిరెడ్డి, మ్యూజికల్ శివ, మాజీ ఉపసర్పంచ్ మణి, మాజీ మల్లయ్యకొండ చైర్మన్ గంగులిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కొండకిట్ట, ఈశ్వర, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

● గుంతకల్లు డివిజన్ రైల్వే సలహా సభ్యుడు



సమస్యలపై స్టేషన్ మాస్టర్‌కు విన్నవిస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రైల్వేస్టేషన్ మాస్టర్ రాజీవ్‌కుమార్‌కు గుంతకల్లు డివిజన్ రైల్వే సలహా సభ్యుడు తల్లం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో కరోనాతో నిలివేసిన రైళ్లు ఇక్కడ ఆగడం లేదని గుంతకల్లు రైల్వే డివిజన్ డీఆర్ఎంకు ఇప్పటికే వినతిపత్రం సమర్పించామని వివరించారు. రైల్వేస్టేషన్ ముందు భాగంలో ఆర్చి లేదని, దీంతో రైల్వేస్టేషన్‌ను ప్రయాణికులు గుర్తించడం కష్టంగా ఉందన్నారు. ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఉన్నాయని, ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. రైల్వేస్టేషన్ ముందు భాగంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, రైలు దిగి ప్రయాణికులు వస్తున్న సమయంలో గంజాయి, మద్యం తాగిన వ్యక్తులు ఉంటారని దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. విన్నవించిన సమస్యలను ఉన్నతాధికారులకు పంపి పరిష్కారిస్తామని స్టేషన్‌మాస్టర్ సానుకూలంగా స్పందించారు.

దాడిలో గాయపడిన జనసైనికుడికి నాయకుల పరామర్శ



చికిత్స పొందుతున్న మునీర్

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రౌడీ మూకల దాడిలో గాయపడి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు చెందిన జనసైనికుడు మునీర్(34)ను శుక్రవారం పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల జనసేన నాయకులు పరామర్శించారు. కందూరు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో మునీర్ గాయపడడంతో అతనిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పీలేరు జనసేన ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, పుంగనూరు జనసేన నాయకులు చిన్నా రాయల్, వేణుగోపాల్‌రెడ్డి అతనిని పరామర్శించారు. దాడి జరిగిన తీరు, దాడిలో పాల్గొన్న వారు, దాడి తరువాత జరిగిన పరిణామాలు అతన్ని అడిగి తెలుసుకున్నారు. అతనికి అందుతున్న వైద్యం గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇతరులపై భౌతిక దాడులకు పాల్పడడం హేయకరమన్నారు. మునీర్‌కు తమ పార్టీ అండగా ఉంటుందని, పార్టీ అధినాయకుల ఆదేశానుసారం చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి మునీర్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పీలేరు, పులిచెర్ల, పుంగనూరు, సోమల మండలాలకు చెందిన పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

శివుని కొండలకు ఉపాధి బాటలు

● రూ.4.30 కోట్లతో రోడ్ల నిర్మాణం
● ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి శ్రీకారం
● శివరాత్రికి పనులు పూర్తయ్యేలా చర్యలు

మదనపల్లె, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలోని కొండలపై కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయాలకు రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే భక్తుల సౌకర్యార్థం కొండలపై వెలసిన శివాలయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండకు, రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి, చెంబకూరులోని గట్టు వెంకటరమణస్వామి ఆలయాలకు భక్తులు వెళ్లేందుకు వీలుగా ఉపాధి హామీ పథకం కింద రూ.4.30 కోట్లతో తారురోడ్లు నిర్మిస్తున్నారు.

వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండకు రూ.1.45 కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మిస్తున్నారు. మదనపల్లె నుంచి పది కి.మీ. దూరంలోని ఈ కొండపైకి వెళ్లాలంటే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపైకి వెళ్లడానికి రెండుమార్గాలు ఉండగా అందులో గుట్టకిందపల్లె నుంచి కొండమీదపల్లె తాండాకు ఇదివరకే రోడ్డు ఫార్మేషన్ చేసి వైసీపీ ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి కూడా రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. అలాగే రెండోమార్గం మునగమాకులపల్లె నుంచి నాలుగు కిలోమీటర్లు కొండ ప్రాంతం. ఈ క్రమంలో మాజీ వీఆర్వో చిప్పిలి జగన్నాథరెడ్డి ఇదివరకే మొదటి మార్గంలోని గుట్టకిందపల్లె నుంచి గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన పనికి ఆహార పథకం, తర్వాత ఉపాధి హామీ పథకాలతోపాటు స్థానికుల సహకారంతో శ్రమదానంతో రోడ్డు ఫార్మేషన్ చేయించారు. అలాగే రెండో మార్గంలోనూ ఇదే తరహాలో మునగమాకులపల్లె మార్గంలోని కొండ కింద నుంచి 2.10 కి.మీ.కొండపైకి మట్టిరోడ్డు ఫార్మేషన్ చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిని తారురోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేస్తూ, క్రాసింగ్‌లను మరింత తగ్గిస్తూ, రాళ్లను పేల్చి రోడ్డు చదును చేస్తున్నారు. మూడు నెలలుగా ఈ పనులు ముమ్మరంగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కొండపైకి వాహనాలు వెళ్లే విధంగా పనులు పూర్తి చేశారు. దీంతో మదనపల్లె పట్టణంతో పాటు వేంపల్లె, అంకిశెట్టిపల్లె, కొత్తపల్లె, బొమ్మనచెరువు, కోటవారిపల్లె పంచాయతీలోని 40 గ్రామాల ప్రజలు కొండపైకి వెళ్లడానికి అవకాశం ఏర్పడటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలలో జరగనున్న మహాశివరాత్రి వేడుకల నాటికి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.



మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపైకి పూర్తయిన రోడ్డు ఫార్మేషన్

గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి..

రామసముద్రం మండలంలోని చెంబకూరు మెయిన్‌రోడ్డు నుంచి కిలోమీటరు దూరంలోని వైఎస్సార్ కాలనీకి సమీపంలోని గుట్టకింద వెలసిన గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి రూ.85 లక్షలతో తారు రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ మూడు ఆలయాలకు ఇప్పటికే రోడ్డు ఫార్మేషన్ పూర్తికాగా గట్టు వెంకటరమణస్వామి ఆలయం మార్గంలో కంకర పరిచే పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా నిధుల మంజూరుకు కృషి చేశారు. ఈ పనులను పంచాయతీరాజ్ డీఈ శివప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా భక్తుల సౌకర్యార్థం శివరాత్రి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



గట్టు వెంకటరమణస్వామి ఆలయానికి గ్రావెల్ రోడ్డు పూర్తయి తారురోడ్డుకు సిద్ధమైన కంకర పనులు

వాలీశ్వరస్వామి కొండపైకి..

రామసముద్రం మండలంలోని ప్రముఖ వాలీశ్వరస్వామి కొండపైకి కూడా ఇదే తరహాలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. రామసముద్రం మండలం నడింపల్లె నుంచి ఎనిమిది కిలోమీటర్లు దూరం ఉంది. ఇక్కడి నుంచి 4.80 కి.మీ. దూరం కొండమార్గం ఇది. ఏటా శివరాత్రి రోజున తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. కొండపైకి సరైన రోడ్డుమార్గం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ కూడా ఇదివరకే మాజీ వీఆర్వో జగన్నాథరెడ్డి కొండను తొలచి, రాళ్లను పేల్చి రోడ్డు ఫార్మేషన్ చేయించారు. ఇందులో సొంత నిధులతో పాటు దాతల సహకారంతో ఈ పనులు చేపట్టారు. అయినా పనులు పూర్తి కాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం వేంపల్లె మల్లయ్యకొండ తరహాలో ఇక్కడి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం రూ.7 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా, మొదటి విడతగా రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మూడు నెలలుగా ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.



రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి కొండపైకి జరుగుతున్న రోడ్డు పనులు

సాగునీటి నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాల్వ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పంట కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని, కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమ పంట పొలాలకు నికరసాగు జలాలు తీసుకురావడానికి అనేక ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. వ్యవసాయం కనీసంగా జీవించాలంటే సాగులోని 30 శాతం భూమికి కనీస సాగునీటి వనరులు కల్పించాలని, జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందని తెలిపారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేలు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుత కాల్వ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదని, వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని, 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగ సభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రకటించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాల్వ గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, శివరామకృష్ణ దేవర, సుమిత్రమ్మ, మనోహర్‌రెడ్డి, జ్యోతి, చిన్నయ్య, మురళీ, సుధీర్‌కుమార్, వెంకటేశ్, కోటేశ్వరరావు, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

రవాణా వ్యవస్థ ప్రైవేటీకరణకు కేంద్రం యత్నం

పీలేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల ముసుగులో దేశంలోని ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఏపీపీటీడీ(ఆర్టీసీ)లోని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు ఆరోపించారు. పీలేరు డిపో కార్యాలయం ముందు వారు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రజా రవాణా వ్యవస్థల్లోకి విద్యుత్ బస్సుల నిర్వహణ ద్వారా ప్రైవేటు యాజమాన్యాలు, కార్పొరేట్ శక్తులను చొప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. 2029 నాటికి ప్రజారవాణా వ్యవస్థలోని 100 శాతం బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలంటూ నిర్ణయం తీసుకోవడం అందులో భాగమేనన్నారు. ఈ నిర్ణయం అమలైతే ఆర్టీసీ కూడా ప్రైవేటీకరణ కావడం తథ్యమని, ఆర్టీసీనే నమ్ముకున్న కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వ్యతిరేకంగా మార్చి 24న జరిగే 'చలో పార్లమెంటు' కార్యక్రమాన్ని ఆర్టీసీలోని కార్మికులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కేసీఎస్ రెడ్డి, హెచ్‌ఎం బాబు, ఎంసీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పీలేరు డిపో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం


జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి



జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, మేయర్ సురేశ్‌బాబు తదితరులు

కడప కలెక్టరేట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని కడప ఎంపీ, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంపీ అధ్యక్షతన దిశా సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. కడప నగర మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ చైర్‌పర్సన్ శారద, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా ఎంపీ మాట్లాడుతూ దిశా కమిటీ సమీక్ష సమావేశం జిల్లాలో మొదటిసారిగా నిర్వహించడం సంతోషకరమన్నారు. సుపరిపాలనతో ముందడుగు వేయడానికి దిశా కమిటీ కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వ 26 మంత్రిత్వ శాఖలకు సంబంధించిన 67 పథకాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని మానిటరింగ్ చేసి పరిష్కరించి ప్రజలకు చేరవేసేందుకు దిశా ఏర్పాటు జరిగిందన్నారు. కేంద్రం నుంచి జిల్లాకు రావాల్సిన నిధులు ఏ విధంగా తెప్పించాలనేది ఈ కమిటీ ద్వారా చర్చిస్తామన్నారు. అమృత్ పథకంలో భాగంగా కడప కార్పొరేషన్‌కు తాగునీరు అందించడానికి రూ.500 కోట్లతో తలపెట్టిన పనులను సత్వరమే ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్డీఏ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ, డ్వామా, గ్రామీణ నీటి పారుదల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల వారీగా జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాలపై ఈ కమిటీలో సుదీర్ఘంగా చర్చించారు. కమిటీసభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు, అంశాలను నమోదు చేసుకున్నామని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్, ఎంపీ పేర్కొన్నారు.

రెవెన్యూ..పోలీసుల రక్షణతో భూమి స్వాధీనం



వివాదాస్పద భూమిని లక్ష్మమ్మకు స్వాధీనం చేస్తున్న రెవెన్యూ, పోలీసులు

రామసముద్రం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి కౌలుకు ఇస్తే భూమి తమదేనని తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేశారని బాధిత మహిళ లక్ష్మమ్మ సీఎంవోకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాలతో కబ్జాదారుల నుంచి భూమిని లక్ష్మమ్మ స్వాధీనం చేశారు. బాధిత మహిళ వివరాల మేరకు మండలంలోని నాగిగానిపల్లె పంచాయతీ ఎర్రనేలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ భర్త వెంకటరమణరాజుకు సర్వే నెంబర్218/1సీలో 2.75 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని ఇదే గ్రామానికి చెందిన సురేంద్రరాజుకు వెంకటరమణరాజు కౌలుకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వెంకటరమణరాజు మృతి చెందగా సురేంద్రరాజు కౌలు భూమికి సంబంధించి దొడ్డిదారిన పట్టా రూపొందించుకున్నాడు. ఈ విషయమై బాధిత మహిళ స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌కు పట్టించుకోలేదని లక్ష్మమ్మ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి బాధిత మహిళ లక్ష్మమ్మకు అప్పగించాలని తహసీల్దార్ నిర్మలాదేవికి గత ఏడాది నవంబర్ 20న ఆదేశాలిచ్చారు. ఇందుకు అనుగుణంగా రెవెన్యూ, పోలీసు సిబ్బందితో తహసీల్దార్ వివాదాస్పద భూమిని పరిశీలించి సర్వే చేసి కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుని బాధిత మహిళ లక్ష్మమ్మకు అప్పగించారు. అయితే భూమి కబ్జాదారులు అప్పటికే భూమిలో పంట సాగు చేయడంతో పంట నూర్పిడి కోసం కొంత సమయం ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం రెవెన్యూ, పోలీసు సిబ్బంది రక్షణలో లక్ష్మమ్మకు భూమిని స్వాధీనం చేశారు. అయితే ఈ భూమి గత 30 ఏళ్లుగా తమ అనుభవంలో ఉందని, దురుద్దేశంతో దౌర్జన్యంగా తమ భూమిని లాక్కున్నారని ఈ భూమి మాకు దక్కకపోతే మరణమే శరణ్యం అని మీడియాతో వాపోయారు.

హౌసింగ్ కుంభకోణంపై విచారణ చివరి దశకు

● వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
● ప్రాథమిక విచారణలో రూ.38 కోట్లు గోల్‌మాల్
● పునర్విచారణలో రూ.44 లక్షలకు కుదింపు
● ముగ్గురు విశ్రాంత హౌసింగ్ ఇంజనీర్లపై చర్యలకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలికిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌసింగ్ కుభకోణంపై పదిహేనేళ్ల క్రితం ప్రారంభమైన విచారణ చివరి దశకు చేరుకుంది. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు వెలువరించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా ముగ్గురు ఉన్నత స్థాయి హౌసింగ్ ఇంజనీర్లు అక్రమాలు, అవినీతికి పాల్పడ్డట్లు విచారణలో తేలింది. చివరి దశ విచారణలో తేలిన అంశాలపై ఈ ముగ్గురి నుంచి పది రోజుల గడువుతో వివరణలు కోరుతూ ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసింది. అప్పట్లో ప్రొద్దుటూరు గృహనిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసి నెల్లూరు ఈఈగా 2023 జూలై 31న పదవీ విరమణ చేసిన పి.నాగేశ్వరరావు, ప్రొద్దుటూరులో హౌసింగ్ ఈఈగా పనిచేసి 2022 ఏప్రిల్ 30 కడప హౌసింగ్ ఎస్ఈ/జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జిగా పదవీ విరమణ చేసిన ఎస్.రాజశేఖర్, ప్రొద్దుటూరు హౌసింగ్ డీఈఈగా పనిచేస్తూ 2023 మార్చి 31న రిటైర్డ్ అయిన ఆర్.వీరన్నలను జరిగిన అక్రమాలు, అవినీతికి ప్రభుత్వం బాధ్యులుగా తేల్చింది.

అమృతనగర్ ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు

ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి. వైఎస్సార్ సీఎంగా వుండగా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామం అమృతనగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. సమీకృత గృహ నిర్మాణం మరియు మురికివాడల అభివృద్ధి పథకం కింద ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఈ కాలనీ గృహ నిర్మాణాల్లో అనేక అవకతవకలు, అవినీతి జరిగిందని అప్పట్లో ఆంధ్రజ్యోతి సమగ్ర కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టరు వెంటనే విచారణకు ఆదేశించారు. అప్పటి కడప, కర్నూలు జిల్లాల ప్రత్యేక అధికారి సమగ్రంగా విచారణ చేయడానికి పలు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయించారు. మొత్తం రూ.38 కోట్ల, 97 లక్షల, 23 వేల, 455లు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఈ మొత్తం అక్రమాలకు, అవినీతికి నిర్మాణాలను పర్యవేక్షించిన ఇంజనీర్లనే బాధ్యులుగా నిర్ధారించారు. దీనిపై తదుపరి చర్యల కోసం ఇంజనీర్లకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసి సంజాయిషీలు కోరింది. అయితే కడప, కర్నూలు ప్రత్యేక అధికారి నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా విచారణ జరపలేదని, సాంకేతిక నిపుణులైన అధికారుల చేత తిరిగి విచారణ చేయించాలని ఇంజనీర్లు ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై పునర్విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అప్పటి హౌసింగ్ సూపరింటెండెంట్ ఇంజనీరు కె.వెంకట నారాయణతో విచారణ జరిపించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే విచారణకు అవసరమైన పత్రాల్లో చాలా భాగం అందుబాటులో లేకపోవడంతో ఉన్నంతలో క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించి నివేదిక అందజేశారు. మొత్తం మీద ఇంజనీర్లు ఉమ్మడిగా రూ.43,63,550ల అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారని విచారణాధికారి ధ్రువీకరించారు. ఇంజనీర్లు విడివిడిగా రూ.10 లక్షలు దుర్వినియోగం చేసినట్లుగా కూడా విచారణలో తేలింది.

అక్రమాలు జరిగిన వివరాలు

గృహ నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు ఉమ్మడిగా రూ.43,63,550లు దుర్వినియోగానికి బాధ్యులుగా పునర్విచారణలో నిర్ధారణ అయింది. ఇందులో రెండిళ్లను కలిపి నిర్మించడంలో రూ.63,000, నిర్మాణ స్థాయిల వ్యత్యాసాల్లో రూ.77,500, రెండుసార్లు చెల్లింపుల ద్వారా (డబుల్ పేమెంట్) రూ.13,84,450, ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం ద్వారా రూ.11,93,600, అడ్మినిస్ట్రేటివ్ ఫీజుల (ఏడీఎఫ్) దుర్వినియోగం రూ.16,45,000లు మొత్తం రూ.43,63,550లు అవినీతి జరిగిందని ప్రభుత్వం వివరించింది. అంతేగాకుండా అప్పటి డీఈఈ ఆర్.వీరన్న ఏడీఎఫ్ నిధుల్లో రూ.7,75,000లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.రాజశేఖర్ రెండేసి మార్లు చెల్లింపుల ద్వారా రూ.2,38,200, ఏడీఎఫ్ నిదుల్లో రూ.5000లు వంతున అక్రమాలకు పాల్పడ్డట్లు తేల్చారు. మొత్తం మీద ఇంజనీర్లు లబ్ధిదారులతో కుమ్మక్కై అనేక అక్రమాలకు పాల్పడిన వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన దరిమిలా ఈ విచారణలు చేపట్టినట్లు ప్రభుత్వం విడుదల చేసిన జీవోల్లో ప్రస్తావించింది. కాగా మొదటి విచారణలో తేలిన దుర్వినియోగం సొమ్ము మొత్తం రూ.38 కోట్ల 97 లక్షల 23 వేల 455లకు సంబంధించిన రికార్డులేవీ అందుబాటులో లేనందున దాన్ని వదిలేసి తాజాగా పునర్విచారణలో నిర్ధారణయిన రూ.43,63,550ల వరకే చర్యలుంటాయా అన్న విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. కాగా పునర్విచారణకు సంబంధించిన దుర్వినియోగమైన నిధులకు సంబంధించి పది రోజుల్లోగా సంజాయిషీలు పంపుకోవాలని ముగ్గురు ఇంజనీర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఆ తరువాత తగు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఐదు వేర్వేరు జీవోలు జారీ చేశారు.

ఫిబ్రవరి 1 నుంచి భూముల ధరల పెంపు



కడప రిజిస్ట్రార్ కార్యాలయం

- కసరత్తు పూర్తి చేసిన జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు
- జాతీయ రహదారులు, రింగ్ రోడ్లకు ఇరుపక్కల భూముల ధరల పెంపుపై దృష్టి
- గతంలో అధికంగా ఉన్న మార్కెట్ వాల్యూ సవరణలు

కడప కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారులో స్పెష ల్ రివిజన్ పేరుతో రెండు దఫాలు పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు పెంచి డబుల్ ధమకాగా స్థిరాస్థిదారుల గెండెల్లో గుభేలుమనిపించారు. పట్టణ ప్రాంతాల వారీగా భూముల ధరలను లెక్కించకుండా ఇబ్బడి ముబ్బడిగా పెంపు చేశారు. అప్పట్లో ప్రజల్లో వ్యతిరేకత వచ్చినా.. రిజిస్ట్రేషన్ అధికారులు కూడా జీ హుజూరు అంటూ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారనే విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిన ప్రాంతాల్లో భూముల విలువలు పెంచారే తప్ప కమర్షియల్‌గా పెంచాల్సిన ప్రాంతాలను గాలికొదిలి ఖజానా శాఖ రాబడికి గండి కొట్టారనే ఆరోపణలు లేకపోలేదు. దీనిపై కూటమి సర్కార్‌కు ఫిర్యాదుల నేపథ్యంలో సవరణలు చేసేందుకు సిద్ధమైంది. గత 3 నెలలుగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, రిజిస్ట్రేషన్ శాఖ డీఐసీ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుతో పాటు ఆర్డీవోలు, రెవెన్యూ యంత్రాంగం తీవ్ర కసరత్తు చేపట్టారు. స్వయంగా భూముల ధరల పెంచే ప్రాంతాలను పరిశీలించడంతో పాటు మార్కెట్ వాల్యూ పెంపు ఏ మేరకు పెంచాలి.. గత ప్రభుత్వ హయాంలో పెంచిన ధరలు అధికంగా ఉన్నాయా.. అనే విషయాలను బేరీజు వేసుకుంటూ భూముల ధరల పెంపునకు అడుగులు వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రాంతాల వారీగా లెక్క గట్టి భూముల ధరల పెంపుపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు జాయింట్ కలెక్టర్ కమిటీకి నివేదిక సమర్పించారు. జేసీ కమిటీ తప్పొప్పులతో పాటు అధికంగా ధరలు ఉంటే సవరణలు చేసి పూర్తి వివరాలతో ప్రభుత్వానికి పంపనున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి అనగాని ప్రసాద్ ప్రకటన నేపథ్యంలో గతంలో స్పెషల్ రివిజన్‌లో అధిక పెంపును సవరిస్తూ స్థిరాస్థిదారులకు భారం కాని విధంగా 10-20శాతం మేర భూముల ధరలు పెంచి ఫిబ్రవరి 1 నాటికి, పెంచిన ధరలతో రిజిస్ట్రేషన్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

జాతీయ రహదారులకు ఇరువైపుల భూముల ధరల పెంపు

ఇన్నాళ్లుగా భూముల మార్కెట్ ధరలు కేవలం పట్టణ ప్రాంతాలు, కమర్షియల్‌గా రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు జరిగే ప్రాంతాలలో మాత్రమే భూములు, స్థలాల ధరలు పెంపు జరుగుతోంది. అది కూడా ప్రతి ఏటా జనవరి, మార్చి నెలల్లో ధరలు పెంచడం రిజిస్ట్రేషన్ శాఖకు ఆనవాయితీ. కానీ ఈ దఫా గత ప్రభుత్వ హయాంలో అధిక పెంపును సవరిస్తూ, జాతీయ రహదారులు, రింగ్ రోడ్లకు ఇరువైపుల భూముల విషయంలో ధరల పెంచేందుకు జిల్లాలో పెద్ద కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఎందుకంటే భూ సేకరణ సమయంలో నష్టపరిహారం చెల్లింపులు, కోర్టు కేసులు లాంటి సమస్యల కారణంగా ఈ భూముల ధరల పెంచితే తిప్ప లు తప్పవని అధికారులకు వెనకడుగులు పడేవి. ముఖ్యంగా ఈ జాతీయ రహదారులకు ఇరువైపుల భూముల్లో అనధికారికంగా కమర్షియల్‌గా కోట్ల రూపాయిలతో నిర్మాణాలు సాగుతున్నాయి. భూముల ధరలు మాత్రం ఎకరానికి రూ.10లక్షల నుంచి 20 లక్షలకు మించేది కాదు. జాతీయ రహదారులు, రింగ్ రోడ్లకు ఇరువైపుల ఇదే భూములను కమర్షియల్‌గా లెక్కిస్తే బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర అక్షరాలు రూ.5 కోట్ల నుంచి 10 కోట్ల పైమాటే. ఇలాంటి అంశాలపై ఇన్నాళ్లు దృష్టి పెట్టని కారణంగా రిజిస్ట్రేషన్ శాఖ రాబడికి పెద్ద ఎత్తున గండి తప్పలేదంటారు.

కడప నగర పరిధిలోని కడప- మద్రాసు రోడ్డు, రామాం జనేయపురం సర్కిల్ నుంచి ఉక్కాయపల్లి మీదుగా ఆలంఖాన్‌పల్లి, ఇర్కాన్ సర్కిల్, అక్కడ నుంచి రాయచోటి వెళ్లే మార్గాలు, పులివెందుల రోడ్డుకు ఇరువైపులా భూముల మార్కెట్ ధరలపై రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులు ఉండే ప్రాంతాల్లో ఎకరం ధర రూ.10-20 లక్షలకు మించని కారణంగా ఆ ప్రాంత రైతుల్లో అసంతృప్తి ఉంది. రైతులకు తమ వ్యక్తిగత అవసరాల కోసం బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణా లు దక్కని పరిస్థితి. తమ భూములు కమర్షియల్‌గా అమ్ముకోలేక పోయినప్పటికీ భూమి ధరలు పెంచడం వల్ల తమ పిల్లల పెళ్లిళ్లకు, చదువులు, ఇతర ఆర్థిక అవసరాలకు బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణాలు పొందే వీలుందని ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలకులకు, అధికారులకు రైతులు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి భూములకు బహిరంగ మార్కెట్ ధరలను పరిగణలోకి తీసుకొని ఒక మోస్తారులో పెంచడం ఖాయంగా కనిపిస్తోంది.

జగన్ సర్కారులో రెండుసార్లు స్పెషల్ రివిజన్

ప్రతి ఏడాది జనవరి, మార్చి మాసాల్లో భూములు, ఇళ్ల స్థలాల ధరల పెంపు ఉంటుంది. కానీ జగన్ సర్కారులో ఐదేళ్ల పాటు మార్కెట్ వ్యాల్యూ పెంచలేదు. కానీ సడిసప్పిడి కాకుండా స్పెషల్ రివిజన్, యూజర్ చార్జీల మోత మోగించారు. దీంతో స్థిరాస్థిదారులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే తడిసి మోపెడు అయ్యేది. ఇకపోతే రిజిస్ట్రేషన్ కార్యాలయాల వారీగా 10-20 శాతం మేర భూముల ధరలు పెంచి స్టాంపు రుసుం కింద ఏటా కోట్ల రూపాయిలు టార్గెట్ విధించేది. కానీ జగన్ సర్కారులో ఐదేళ్ల పాటు భూముల ధరలు పెంచకుండానే స్పెషల్ రివిజన్ సాకుతో డబుల్ రాబడి రాబట్టడంలో దిట్టలని చెప్పవచ్చు. 2023లో కడప రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఏడాదికి రూ.54 కోట్ల రాబడి టార్గెట్ ఉండేది. స్పెషల్ రివిజన్‌లో ఏకంగా రూ.84 కోట్లు టార్గెట్ విధించడం ఇందుకు తార్కాణం. స్థిరాస్థిదారులకు ఒక భద్రతగా స్టాంపుల వ్యవస్థ ఉండేది. దానిని కూడా రద్దు చేసి ఈ-స్టాంపు విధానం తేవడంతో పెద్ద విమర్శలు ఎదుర్కోక తప్పలేదు. ఇకపోతే యూజర్ చార్జీలు రూ.200 నుంచి రూ.500లకు, ఈసీ కావాలంటే రూ.20ల నుంచి రూ.100లకు పెంచారు. స్టాంపులకు చలానా ఉండేది కాదు. ఇపుడు రూ.50లు చెల్లించే పరిస్థితి వచ్చిందంటే జగన్ సర్కారులో గుట్టుచప్పుడు కాకుండా స్థిరాస్థి రిజిస్ట్రేషన్లపై ప్రజలపై మోత మోగించింది. ఇలాంటి అంశాలను ఈ దఫా సర్కారు సవరణలు, సర్దుబాటులు చేసే దిశగా పావులు కదుపుతోంది.

ఎల్‌పీ నెంబర్లతో రిజిస్ట్రేషన్ల రాబడికి

జగనన్న భూరక్ష పేరుతో భూముల రీసర్వే తప్పులు తడకగా సాగింది. రైతులకు సంబంధించిన భూములకు సర్వే నెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సల్ (ఎల్‌పీ) నెంబర్లు కేటయించారు. అయితే ఆ భూమిని రైతు తన ఇబ్బందుల రీత్యా కొంత అమ్ముకుంటే.. ఆ భూమిని కొన్న వ్యక్తులకు భవిష్యత్తులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల కష్టాలు తప్పడం లేదు. దీంతో రీసర్వేలో అనాలోచిత నిర్ణయాలతో ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన జిల్లాలో 200కు పైగా గ్రామాల్లో స్థిరాస్థిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. కళ్లెదుటే లక్షలు, కోట్ల విలువలు చేసే భూములు ఉన్నా తమ ఆర్థిక ఇబ్బందులకు అమ్ముకోలేని పరిస్థితి. దీంతో రెవెన్యూలో కూడా ఎల్‌పీ నెంబర్లకు బై నెంబర్లు జోడించడంతో రిజిస్ట్రేషన్లు జరగని కారణంగా పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ల శాఖ రాబడికి గండి పడింది. ఇలాంటి పరిస్థితి జగన్ సర్కారులో రీసర్వే జరిగిన 285 గ్రామాల్లోని 4.44 లక్షల ఎకరాల రైతులకు తప్పలేదు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్లు, రిజిస్ట్రేషన్ అధికారులు తప్పొప్పుల సవరణలకు ముందుకు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రెవెన్యూ సదస్సులో ఎల్‌పీ నెంబర్ల విధానం సవరణలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. అందులో ఉన్న తప్పొప్పులను సరిదిద్దితే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగేందుకు వీలుందంటారు.

పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తారాకరామనగర్‌లో జరుగుతున్న డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువల్లో చెత్తా చెదారం వేయవద్దన్నారు, వారానికి ఒకసారి ఇళ్లలోని నీటి తొట్లు, కుండలు, బాన లు ఇతర పాత్రలను శుభ్రం చేసి కొంత సేపు ఎండలో ఉంచాలన్నారు. దోమ ల నియంత్రణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. లేకపోతే దోమ కాటుకు విషజ్వరాలు మలేరియా, డెంగ్యూ సోకే ప్రమాదం ఉందన్నారు. రాత్రి వేళల్లో దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు. మెడిక్ ఆఫీ స రు సుభానీ, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ మలేరియా అధికారి నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మీదేవి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేలంను అడ్డుకున్న మారుతీ మహాలక్షుమ్మ



వేలం నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడుతున్న మారుతీ మహాలక్షుమ్మ

బ్రహ్మంగారిమఠం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో కొబ్బరిముక్కలు వసూలు చేసే హక్కుకు సంబంధించి శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టరు జనార్దన్ నేతృత్వంలో వేలం నిర్వహించారు. ఈవిషయం తెలుసుకున్న దివంగత మఠాధిపతి వసంత వేంకటే శ్వరస్వామి సతీమణి మారుతీ మహాలక్షుమ్మ పాట మధ్యలో అడ్డుకున్నారు. దేవస్థానంలో వేలం నిర్వహించడానికి ఫిట్‌పర్సన్‌కు అర్హత లేదన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా వేలంపాట కార్యక్రమాన్ని చేపడతారని అక్కడున్న అధికారులను ప్రశ్నించారు. ఉదయం 10గంటలకు వేలం ప్రారం భం కాగా.. మొదటి కొబ్బరిముక్కలు వసూలు చేసే హక్కుకు వేలం నిర్వహించారు. పాటదారుడు రూ.14లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. అనంతరం పోలేరమ్మ గుడి ఆవరణలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు వేలం నిర్వహిస్తున్న సందర్భంలో మారుతీ మహాలక్షుమ్మ మధ్యలో వచ్చి పాటను రద్దు చేయాలని అధికారులను కోరారు. దీంతో చేసేది లేక అధికారులు వేలం రద్దు చేసి వెళ్లిపోయారు.

వాహనం ఢీ.. వ్యక్తి మృతి




ఎర్రగుంట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమకూరులో శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. చిలమకూరు నాలుగురోడ్ల కూడలిలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. చిలమకూ రులో కొంతకాలంగా భిక్షాటన చేస్తూ తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతి చెందిన వ్యక్తి పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలంలోని ముద్దిరెడ్డిపల్లె సమీపంలో ట్రాక్టర్ ఢీ కొనడంతో తంగెళ్ల జానీ(40) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన జానీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవిస్తుండేవారు. శుక్రవారం సాయంత్రం పని పెంట నుంచి ఇంటికి బైక్‌పై వెళుతుండగా చెత్త లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వాచ్‌మేన్‌పై దాడి.. తీవ్ర గాయాలు



కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో ఓ హోటల్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న రామక్రిష్ణను ఓ యువకుడు చాకుతో పొడిచాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. నాగరాజుపేటకు చెందిన రామక్రిష్ణ హోటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఓ యువకుడు అక్కడికి వచ్చి అతనితో గొడవ పడి తన వద్ద ఉన్న చాకుతో పొడిచి పారిపోయాడు. దీంతో రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా డు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు గాయపడ్డ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

యువతి అదృశ్యం

కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురం బహాజననగర్‌కు చెందిన యువతి గురువారం అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. కడప బహాజననగర్‌కు చెందిన షేక్ రేష్మా గురువారం ఇంటి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, ఆచూకీ తెలిసిన వారు 9121100524కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సఖ్యతగా ముందుకు సాగుతాం...

కేంద్ర పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి



బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న సింగారెడ్డి

కడప మారుతీనగర్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా కొనసాగుతూనే మిత్రపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేన నాయకులతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సఖ్యతగా ముందుకుసాగుతామని కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఇటీవల పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జె.వెంకట సుబ్బారెడ్డిని సింగారెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఇబ్బందులను పాలక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రాయలసీమలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, రోడ్ల సమస్యలు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు వెనుకాడబోమన్నారు. ఇప్పటికే పార్టీలో యువత అధికశాతం సభ్యత్వం స్వీకరించారని, సీనియర్ నాయకుల సలహా, సూచనలతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కళ్యాణ్, లక్ష్మణరావు, మహిళానాయకురాలు పద్మావతిబాయి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి కారుణ్య నియామక ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న జడ్పీ సీఈవో, చైర్మన్

కడప రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజాపరిషత్ శాఖలో నలుగురికి కారుణ్య నియామక ఉద్యోగాలు కల్పించినట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన ఉద్యోగులకు ఆయా మండలాల్లో పోస్టింగ్‌లు కల్పించామన్నారు. ఇందులో పి.మనోహర్‌ను పెగలూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో, పి.నాగలక్ష్మిని వల్లూరులోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో, సి.అంకాలయ్యను కొండాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో, డి.వెంకట పృధ్వీరాజ్ ఆర్యన్‌ను పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా నియమించామని తెలిపారు. ఉద్యోగాలలో చేరిన వారు బాధ్యతగా విధులను నిర్వర్తించాలని తెలిపారు. వీరికి నియామక పత్రాలను చైర్మన్ జె.శారదతో కలిసి అందించామన్నారు.

లారీలో మంటలు



సికెదిన్నె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో లారీలో అగ్నిప్రమాదం సంభవించింది. కడప-రాయచోటి జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం గువ్వలచెరువు ఘాట్ మూడో మలుపు వద్ద లారీలో హీట్ అయిన కారణంగా క్యాబిన్‌లో మంటలు సంభవించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే డ్రైవర్ క్యాబిన్, ముందు టైర్లు కాలిపోయాయి. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదని తెలిసింది.

అన్నదాన సత్రం సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

ఖాజీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగనాదేశ్వర కొండ కింది భాగంలోని అన్నదాన సత్రంను సీజ్ చేసినట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, తహసీల్దారు మహబూబ్‌బాష తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి చైర్మన్ ఎటువంటి అనుమతులు లేకుండా కొండ కింది భాగంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేశా రు. ప్రస్తుతం అన్నదాన సత్రంలో పలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు భక్తుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు రావడంతో ఆమేరకు పరిశీలించి సీజ్ చేశామని తెలి పారు. పవిత్రమైన కొండ కింది భాగంలో అపవిత్రతకు పాల్పడితే అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో సచివాలయ ఉద్యోగి మృతి



గణేశ్ మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని కనంపల్లె గ్రామానికి చెందిన కాటమదేవ గణేశ్ (27) అనే సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో చెందాడు. వివరాలిలా.. కనంపల్లెకు చెందిన కాటమదేవ గంగరాజు ఏకైక సంతానమైన గణేశ్ తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన రైతు సేవా కేంద్రంలో పశు సంవర్ధక సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతనికి భార్య కవితతో పాటు నాలుగు సంవత్సరాల కుమార్తె కూడా ఉంది. ప్రతిరోజూ లాగే శుక్రవారం విధులకు హాజరై తిరిగి ఇంటికి వచ్చి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. అయితే గణేశ్ ఆత్మహత్యకు గల కార ణాలు తెలియాల్సి ఉంది. అర్బన్ ఎస్ఐ నారాయణ సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. గణేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటి కాల్వలో వృద్ధుడు..




పక్కీరప్ప (ఫైల్)

పులివెందుల టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నీటి కాల్వ లో ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే దారిలో ఉన్న కాల్వలో మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. దర్గావీధికి చెందిన పక్కీరప్ప (78) అనే వృద్ధుడి మృతదేహం కాల్వ వద్ద పడి ఉంది. అటుగా వెళ్లిన స్థానికులు ఈ విషయాన్ని పలువురికి తెలియజేయడంతో కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో వారు ఘటనా ప్రదేశానికి చేరుకుని ఫక్కీరప్పను గుర్తుపట్టారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. లింగాల మండలం మురారిచింతల గ్రామం సొంత ఊరు కాగా.. శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో లింగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా వృద్ధుడు మృతి చెందిన ప్రదేశంలో నీరు పెద్దగా లేకపోవడం, ఇక్కడ బట్టలు శుభ్రం చేసే వారు, గేదెలను మేపుకునేవారు నిత్యం సంచరిస్తూ ఉంటారని... ఈ నేపథ్యంలో వృద్ధుడు మృతి పలు అనుమానాలకు తావిస్తోంది.

వ్యక్తిపై కత్తులతో దాడి



కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న వైన్‌షాపులో శుక్రవారం సాయంత్రం మద్యం తాగుతున్న వ్యక్తిపై కత్తి, గొడ్డలితో కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి వివరాల మేరకు.. కడప మాసాపేటకు చెందిన వెంగళరాజా యార్డులో హమాలీగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి మందు తీసుకుని పక్కనున్న రూములో తాగుతుండగా మాసాపేటకు చెందిన కొందరు యువకులు అక్కడికి చేరుకుని అతనితో ఘర్షణ పడి గొడ్డలి, కత్తులతో తలపై దాడి చేశారు. రక్తస్రావం ఎక్కువ కావడంతో అక్కడున్న వారు రిమ్స్‌కు తరలించారు. మాసాపేటకు చెందిన ప్రసన్న, సాయిలు తనపై కక్ష పెంచుకుని మరికొందరితో కలిసి వచ్చి తనపై దాడికి పాల్పడ్డారంటూ రిమ్స్ అవుట్ పోస్టు లో ఫిర్యాదు చేశాడు. టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఈ సంఘటనపై విచారిస్తున్నారు.



ఫిలిం యాక్టర్స్ కావలెను

షార్ట్ ఫిలిం కొరకు చైల్డ్ యాక్టర్స్ మరియు యంగ్ యాక్టర్స్ కావలెను. ఆసక్తిగల యువకులు షార్ట్ ఫిలింలో నటించే అవకాశం కలదు. ఎవరైన యాక్టింగ్ చేయుటకు ఉత్సాహం, ఆసక్తిగల అభ్యర్థులు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు. సెల్: 91004 75355
Ajc-224699

WANTED

కడప నగరంలోని ప్రముఖ నజ్ముల్ అమీన్ స్కూల్‌నందు 6 to 10 బయాలజి, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్స్ బోధించుటకు అనుభవం కల టీచర్స్ కావలెను. సంప్రదించండి: 77805 01017
Ajc-224628

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
Ajc-224694

ONE SITTING

10th/Inter / Degree / P.G. MPC / BiPC, M.Bi.P.C. /C.E.C., B.A., B.Com., B.Sc. (C), M.A., M.Com., M.Sc (C), B.Tech (All). Exams : March / October. SEA Academy, Y Junction, Kadapa. Cell : 99493 93809, 76740 90494
AJC-224700

ఒవెల్ జూనియర్ కాలేజి

(ఒవెల్ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్) నెల్లూరు నందు క్రింద తెలిపిన కేంద్రాలలో పనిచేయుటకు 5 సం॥ల అనుభవం కల్గిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. కేంద్రాలు: కడప, రాయచోటి, బద్వేల్, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, చిట్వేలి, రాజంపేట, చెన్నూరు, ఖాజీపేట, వేంపల్లి, జమ్మలమడుగు, పులివెందుల, కదిరి కలసపాడు. జీతం : 20 వేలు నుండి 30 వేలు వరకు. Cell : 87126 15168, 91000 41475
Ajc-000

CHANGE OF NAME

I, Valoor Shafiulla (Old name), D.No: 22/276, Moulana Azad Street No.3, Proddatur Town, YSR Kadapa Dist, hereby changed my name as Valloor Shaik Shaifulla (New name)
AJC-000

WANTED TELECALLERS

Work from kadapa city qualification..inter (only ladies) attractive salary Cell 90104 43277
AJC-224695

ఉద్యోగ అవకాశాలు

కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, అకౌంటెంట్, బ్రాంచ్ మేనేజర్ కావలెను. నెలవారీ జీతం : కంపెనీ ప్రమాణాల ప్రకారం, ఉద్యోగ స్థానం : రాజంపేట, కంపెనీ : SLN మార్కెటింగ్ PVT LTD, పరిశ్రమ రకం : రియల్ ఎస్టేట్ పరిశ్రమ, రాజంపేట మరియు రైల్వే కోడూరు ప్రజలకు మాత్రమే, మీకు ఆసక్తి ఉంటే మీ రెజ్యూమ్‌లను 8121628089కి సంప్రదించండి / షేర్ చేయండి.
Ajc-230654

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA-224890

యూనిట్ కార్యాలయం

9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఖైదీలకు వైద్య పరీక్షలు

కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉప పర్యవేక్షణ అధికారులు కమలాకర్, రమేశ్‌ల పర్యవేక్షణలో రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖైదీలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఇలాంటి పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామన్నారు. వైద్యులు పుష్పలత, నవీన్ శ్రీదేవిలు ఖైదీలకు వైద్యసలహాలు అందించారు. జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన

సికెదిన్నె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె గ్రామంలో వెలసిన అవధూత తిమ్మగురుస్వామి ఆరాధన శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆరాధన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

లేగదూడల సంరక్షణ చేపట్టాలి

సికెదిన్నె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): లేగదూడల సంరక్షణ చేపట్టాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శారదమ్మ తెలిపారు. ఇప్పెంటలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఏడీ శ్రీధర్‌లింగారెడ్డి, డాక్టర్లు శరత్‌కుమార్, నాగరాజు, కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి, చంద్రకిశోర్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన గండికొవ్వూరు-వెన్నపల్లె బ్రిడ్జి

● టెండర్లు పిలిచారు... పనులు మరిచారు ● పట్టించుకోవాలని ప్రజల వినతి

చక్రాయపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాఘ్ని నదిపై గండికొవ్వూరు-వెన్నపల్లె మధ్యలో బ్రిడ్జి నిర్మించాలని కొన్నేళ్లుగా ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపారు. కానీ బ్రిడ్జికి మాత్రం మోక్షం లేదు. ఇది రెండు జిల్లాలను కలిపే రహదారి. ప్రధాన రహదారి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. కానీ బ్రిడ్జికి ఎవరూ చొరవ చూపలేదు. మండల కేంద్రానికి పాపాఘ్ని నదీ తీరప్రాంతవాసులు రావాలంటే అటు రాచుపల్లె, కుప్పం మీదుగా చక్రాయపేటకు 20 కిలోమీటర్లు, అద్దాలమర్రి, కొండవాండ్లపల్లె మీదుగా రావాలంటే 15 కిలోమీటర్లు. అలా కాకుంటే గండికొవ్వూరు వద్ద బ్రిడ్జి నిర్మిస్తే చక్రాయపేట రెండు కిలోమీటర్లు మాత్రమే. అంతేకాకుండా అటు అనంతపురం, ఇటు కడప జిల్లాలను కలిపే రహదారి. అలాగే ప్రస్తుతం అద్దాలమర్రి హైవే కూడా వేశారు. తలుపుల, కదిరి, అనంతపురానికి మెయిన్ రోడ్డు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని అప్పటి మంత్రి రాజగోపాల్‌రెడ్డి ప్రతిపాదనలు చేశారు. అనంతరం ఆ బ్రిడ్జిని కొండవాండ్లపల్లె సమీపాన అద్దాలమర్రి క్రాస్ వద్ద లోలెవెల్ బ్రిడ్జి మంజూరు చేశారు. ఎమ్మెల్యేగా ద్వారకనాథరెడ్డి ఉన్నప్పుడు అప్పటి కలెక్టర్‌ను పిలిపించి అంచనాలు వేయించి బ్రిడ్జి వేయాలని ప్రతిపాదించారు. అనంతరం తులసిరెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు గండికొవ్వూరు వద్ద బ్రిడ్జి నిర్మిస్తే మెయిన్ రహదారి అవుతుందని ప్రతిపాదనలు పంపారు. అయితే అవన్నీ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కర్నాటి మురళీధర్‌రెడ్డి ఉప మండలాధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా కలెక్టర్‌ను పిలిపించి ప్రధాన రహదారి అని చెప్పి ప్రతిపాదనలు పంపించారు. అవన్నీ గాల్లో కలిసిపోయాయి. కాగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం, నిధులు మంజూరు చేయడం, టెండర్లు కూడా పిలవడం పూర్తయింది. అనంతరం ఏం జరిగిందో తెలియదు. పనులైతే చేపట్టలేదు. ఇక్కడ లోలెవెల్ బ్రిడ్జి మంజూరైందని స్థానిక నాయకులు పదేపదే చెబుతున్నారు. రెండు బస్సులు మారాలి, వాహనాలలో వచ్చేందుకు కురదడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి బ్రిడ్జి నిర్మిస్తే రెండు జిల్లాలను కలపడంతో పాటు రెండు ప్రాంతాలు కూడా సులువుగా మండల కేంద్రానికి చేరవచ్చని ప్రయాణికులు విన్నవిస్తున్నారు.



బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం ఇదే...

హైలెవెల్ బ్రిడ్జి త్వరగా నిర్మించాలి

పాపాఘ్ని నదిపై గండికొవ్వూరు- వెన్నపల్లె వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తే అటు అనంతపురానికి, కడపకు ఎంతో ఉపయోగం. పాపాఘ్ని నదీ తీరప్రాంతవాసులు ప్రతి పనికి మండల కేంద్రానికి రావాలి. మండల కేంద్రానికి రావాలంటే దాదాపు 15 కిలోమీటర్లు తిరిగి రావాలి. అదే బ్రిడ్జి నిర్మిస్తే రెండు కిలోమీటర్లు మాత్రమే అవుతుంది. చాలా దూరం ఉండటంతో రైతులు పంటలు మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు. ఇటీవల టెండర్లు కూడా పిలిచారు. త్వరగా పనులు ప్రారంభించాలి.

- యోగి, నాగిరెడ్డిపల్లె, చక్రాయపేట మండలం

చంద్రశేఖర్‌రెడ్డిని సర్వీస్ నుంచి తొలగించాలి: టీడీపీ

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కామంతో కళ్లుమూసుకుపోయిన కడప జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించి, కఠిన చర్యలు చేపట్టాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిక హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం హరి టవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి తన శాఖలో పనిచేసే మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం దారుణమన్నారు.

సీపీఐ నిరసన



సికెదిన్నె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో కీచక అధికారిని ఉద్యోగం నుంచి తొలగించాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏపీ మహిళా సమాఖ్య మండల కార్యదర్శి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉప రవాణా శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. హ్యూమన్‌రైట్ నేత గోర్లరెడ్డి, ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి శివనాగేంద్ర, మహిళా సమాఖ్య నాయకురాళ్లు దేవి పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల పాక్షిక ఉపసంహరణపై నిషేధం ఎత్తివేయాలి

● యూటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులు తమ కాంట్రిబ్యూషన్ నుంచి అవసరాల కోసం పొందే ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఉప ఖజానా శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లును ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు తమ జీతం నుంచి కాంట్రిబ్యూషన్‌గా చెల్లించిన సొమ్ములో 25శాతం వ్యక్తిగత, అనారోగ్య అవసరాల కోసం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉందని, ఆ సొమ్ము పొందడానికి ఖజానా శాఖ నిషేధ విధించడం సరికాదన్నారు. వెంటనే నిషేధాన్ని ఎత్తివేయాలని కోరారు. స్పందించిన ఉప ఖజానా శాఖాధికారి వెంకటేశ్వర్లు వెంటనే రాష్ట్ర అధికారులతో మాట్లాడారు. పాక్షిక ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తున్నట్లు వారు తెలియజేయడంతో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లె గోపీనాథ్, సురేష్‌బాబు, వై.రామకేశవ పాల్గొన్నారు.

రోడ్డుభద్రత సమష్టి బాధ్యత

కడప మారుతీనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మణికంఠ అన్నారు. కడప నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక యూత్ హాస్టలు వద్ద రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలన్నారు. వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అశోక్, విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, (F.T.C.) బద్వేలు వారి కోర్టులో
O.S. No. 03/2023
1) ఓకిలి విజయభాస్కర్‌రెడ్డి S/o చిన్న సుబ్బారెడ్డి, వయస్సు 47 సం.లు, శంకరాపురం, కడపసిటీ, వైఎస్ఆర్ కడపజిల్లా, 2) లేవాకు విజయప్రతాప్‌రెడ్డి S/o శ్రీరామిరెడ్డి, వయస్సు 47 సం, బలిసింగనపల్లె గ్రా., చెన్నూరు (మం.) వైఎస్ఆర్ కడపజిల్లా - వాదులు
V/s
1) నారి అమ్మణ్ణమ్మ W/o పోతులూరయ్య, వయసు 68 సం., నివాసం డి.నెం. 39-25-2-38, సుబ్బారెడ్డి కాలేజీ దగ్గర, కడపసిటీ & జిల్లా. - ప్రతివాది-1
సమను
వాదులు, ప్రతివాది-1 అయిన నీపైన అగ్రిమెంటు తేది 12-09-2022లోని దావా షెడ్యూలు దాఖలా పొలం రిజిష్టేషన్ కొరకు మరియు ప్రతివాది నెం.1 అయిన మీరు రిజిష్టర్ డాక్యుమెంట్ నెం. 76/2023 తేది 7-01-2023న ప్రతివాదులు 3 నుండి 6కి మీరు చేసిన డాక్యుమెంట్ రద్దుకు దావా దాఖలు చేసి ఉన్నారు. కావున మీకేమైన అక్షేపణలున్న యెడల రాజశ్రీ కోర్టు నందు 3-02-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు నేరుగా కాని వకీలు ద్వారా కాని హాజరు కావలెను. లేని యెడల పైనెంబరు దావాను కోర్టు వారు మీకు పరోక్షంగా తీర్మానించబడును. షెడ్యూలు: కడపజిల్లా, బద్వేలు సబ్‌డి. బి.మఠం మండలం, నాగిశెట్టిపల్లె గ్రామపొలం నందు డి.నెం. 133/4-ఎ, విస్తీర్ణం 5.00 ఎకరాలు పైకి 3-00 ఎకరములు. హద్దులు: తూర్పు - డి.నెం. 134 పొలం, దక్షిణం - రస్తా మరియు ఇతరుల పొలం, పడమర - క్రిష్ణ మోహన్ పొలం, ఉత్తరం - ఇతరుల పొలం
వాయిదా తేది: 03-02-2025
By Order of the Court
ఆర్.ఆర్. వర్మ, యు. మురళీకృష్ణ, టి.యోగేష్ వాదుల తరపు న్యాయవాదులు, బద్వేలు

'పేదలకు న్యాయం చేయండి'

కడప కలెక్టరేట్ జనవరి 24(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ పాత కడప ఎస్సీ కాలనీవాసులకు న్యాయం చేయాలని వినియోగదారుల పరిష్కార వేదికలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్ అంజనేయమూర్తి (రిటైర్డ్ న్యాయమూర్తి)కి టీడీపీ నేత, మాజీ కార్పొరేటర్ ఇసుకల చైతన్య శుక్రవారం ఫిర్యాదు చేశారు. పాత కడప మోడల్ కాలనీలో 2014 నుంచి 2019 వరకు ఎస్సీలకు కరెంట్ బిల్లులు రూ.100నుంచి 200 వరకు వచ్చేవివని, 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం అని ప్రకటించడంతో బిల్లులు కట్టే అవసరం రాలేదన్నారు. కానీ ఇప్పుడు విద్యుత్ అధికారులు పాత బకాయిలు కడితేనే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు.


శభాష్ డ్రైవర్ అన్నా..

కమలాపురం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బస్సులో ప్రయాణిస్తున్న మహిళకు ఆయాసం రావడంతో ప్రయాణికులు డ్రైవరుకు తెలపగా వెంటనే బస్సును ఆసుపత్రిలోకి తీసుకెళ్లిన డ్రైవరు ఆమె ప్రాణాలు కాపాడడంతో డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు. గురువారం రాత్రి కమలాపురం పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన డయాలసిస్ పేషంటు భాగ్యలక్ష్మి కడప నుండి కోగటం మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లే బస్సులో కమలాపురం వచ్చింది. అయితే ఆమె గమ్యస్థానాన్ని చేరేలోపే ఒక్కసారిగా ఆయాసం రావడంతో ప్రయాణికులు డ్రైవరుకు విషయం తెలిపారు. వెంటనే స్థానిక ఆసుపత్రిలోకి బస్సును మళ్లించారు. వెంటనే తోటి ప్రయాణికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వెంటనే ఆమెకు రాత్రి డ్యూటీలో ఉన్న వైద్యులు చికిత్సనందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళను సమయానికి ఆసుపత్రిలో చేర్పించడం పట్ల తోటి ప్రయాణికులు కుటుంబ సభ్యులు ఆ డ్రైవరుకు అభినందనలు తెలిపారు.

ఎస్ఐ కుటుంబానికి అండగా ఉంటాం

కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసుస్టేషనులో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎస్ఐ వై.సుబ్బరాయుడు కుటుంబానికి అండగా ఉంటామని అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. శుక్రవారం పోలీసు వితరణ విధి నుంచి రూ.2.5 లక్షలు ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కు రూపంలో సుబ్బరాయుడు సతీమణి వెంకటలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఏవో ఎన్.జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, బి.సెక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్‌నాయక్, జూనియర్ అసిస్టెంట్ మహ జబీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి పలువురి శుభాకాంక్షలు



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేశ్ తదితరులు



శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యోగ, తదితరులు

కడప క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్‌ను పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, జిల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ రఘునాథరెడ్డి, ఈసీ మెంబర్లు, టీపీపీ మాధవీలత, ఏప్రిన్, అసోసియేషన్ మెంబర్లు ఆర్ఎస్ఐ రామస్వామిరాజు, పీసీలు డి.పుల్లయ్య, నాగార్జున, పోలీసు సంఘం నాయకులు పాల్గొని ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యలు దృష్టికి తెస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

జిల్లా పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో...

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్‌ను శుక్రవారం కడప జిల్లా పోలీసు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యోగ, ట్రెజరర్ గంగరాజు యాదవ్, రాష్ట్ర, జిల్లా కోఆప్షన్ మెంబరు బండారు రామక్రిష్ణ, కార్యవర్గ సభ్యుడు జగన్ మోహన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, లక్ష్మీదేవి కలిసి అభినందనలు తెలిపారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన విలువలతో జీవించడం ద్వారా ఒత్తిడికి దూరంగా ఉండాలని ప్రముఖులు ఉద్ఘాటించారు. తమిళనాడు శ్రీపెరంబుదూర్‌లోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ భారత ప్రభుత్వ పార్లమెంట్ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వైవీయు ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంపై శిక్షకుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో రెండోరోజు శుక్రవారం రిమ్స్ మా నసిక వైద్య నిపుణుడు డాక్టర్ వెంకటరాముడు హాజరై మాట్లాడుతూ మానసిక జబ్బుల రకాలు వాటి నివారణ మార్గాల గురించి అవగహన కల్పించారు.

పశువైద్య విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్‌గా గీతాప్రియ

కడప రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) :కడప జిల్లా పశుసంవర్ధకశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ లక్కిరెడ్డి గీతాప్రియ చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గులో ఉన్న కామధేను పశువైద్య విశ్వవిద్యాలయానికి బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ పదవిలో మూడు సంవత్సరాలుగా కొనసాగనున్నారు.నియామకం భారత ప శువైద్య మండలి ద్వారా జరిగింది. ప్రస్తుతం డాక్టర్ గీతాప్రియ భారత పశువైద్య సభ్యురాలిగా ఉన్నారు.



గీతాప్రియ, అసిస్టెంట్ డైరెక్టర్

పులివెందులకు ఉప ఎన్నికలు ఖాయం : బీటెక్ రవి

పులివెందుల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులకు ఉప ఎన్నికలు ఖాయమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. వైసీపీ నేత రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి రాజకీయాల నుంచి తప్పుకోవడం చూస్తుంటే పులివెందులకు ఉప ఎన్నికలు రావడం ఖాయంగా కనపడుతోదన్నారు. రాజకీయాలకు విజయసాయిరెడ్డి రాజీనామా చేశారంటే అప్రూవర్‌గా మారడం ఖాయమన్నారు. ఇక జగన్ డిస్క్వాలిఫై అవుతారన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడపను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతామని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి అన్నారు. శుక్రవారం కడపలోని ద్వారకానగర్ ఎమ్మెల్యే నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించి నగరాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. రూ.8కోట్లతో బుగ్గవంక సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చె ప్పారు. అడ్డంకిగా తయారైన విద్యుత్ స్తంభాల తొలగింపుపై అధికారులతో చర్చించామన్నారు.సీటి సరఫరా, రోడ్డు, కాల్వల నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. నగరంలో పెద్దఎత్తున అక్రమ కట్టడాలు వెలిశాయన్నారు. ఎవరైనా అక్రమాలకు పా ల్పడితే ప్రజలే అడ్డుకోవాలన్నారు.గత పాలకులతో కుమ్మక్కై కొందరు అధికారులు ఇష్టానుసారం గా వ్యవహరిస్తున్నారన్నారు. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొని నష్టపోవద్దని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కడప(వినాయకనగర్), జనవరి24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా కోరారు. నేషనల్ ఓటర్స్‌డే సందర్భంగా కోటిరెడ్డి సుబ్బమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా వక్తృత్వ, గ్రూప్ డిక్షన్స్ పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి విజయలక్ష్మీదేవి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు.

ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా శ్రీదేవి

లింగాల, జనవరి 24: లింగాల మండలం దిగువ లింగాల గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న శ్రీదేవికి ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా అవార్డు లభించింది. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ చేతులమీదుగా కడపలో అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం సంతోషంగా ఉందని మరింత బాధ్యతాయుతంగా సేవలందిస్తానని శ్రీదేవి అన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

పెండ్లిమర్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంది మండలం పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు కుష్ఠు వ్యాధిపై జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ రవిబాబు అవాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఫిజియోథెరపిస్ట్ విక్టర్ మనోహర్‌తో కలిసి శుక్రవారం సిబ్బందికి మీటింగ్ ఏర్పాటుచేసి కుష్ఠు కార్యక్రమంపై అవగాహన కల్పించి రికార్డులు పరిశీలించారు. డాక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ రామప్రతాప్, సూపర్వైజర్ రవీంద్రనాథ్, ఏఎన్ఎమ్ సుహాసిని పాల్గొన్నారు.

జీవో విడుదల చేయాలి: ఏఐటీయూసీ

కడప సెవెన్ రోడ్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంపుదల జీవోను విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా తెలిపారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో రాష్ట్ర వ్యాప్త సివిల్ సప్లై హమాలి యూనియన్ పిలుపులో భాగంగా గోడౌన్ మూసివేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి మురారి, నాయకులు వెంకటరమణ, ప్రతాప్, రామ్మోహన్, రాజశేఖర్, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శిగా రిమ్స్ ఉద్యోగి

కడప సెవెన్ రోడ్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న పి.వెంకటసుబ్బయ్యను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికి తక్షణం ఎంటీఎస్‌ను అమలు చేయాలన్నారు.



వెంకటసుబ్బయ్య


పిల్లల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలు వహించాలి

కడప రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహములోని పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపట్ల తగు జాగ్రత్తలు వహించాలని డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహములను జడ్జి విజిట్ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024 వివరించారు.

మెరుగైన విద్యతోనే సమగ్రాభివృద్ధి

వల్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారులు రమేశ్, రమణమ్మ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వల్లూరు మండలం కస్తూర్బా పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్లతో పాటు కన్సల్టెంట్ పాలేశ్వర్‌రావు, సీహెచ్‌వో వేణుగోపాల్, సూపర్‌వైజరు సుధాకర్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆసుపత్రి యాజమాన్యంతో కలిసి ర్యాలీ నిర్వహించారు.


చెన్నూరు: కిశోరబాలికలకు ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యరక్షణ ముఖ్యమని చెన్నూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నాదేవి అన్నారు. చెన్నూరులో ఉన్నత పాఠశాల విద్యార్థినులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురమ్మ, నాగరత్నమ్మ ఆధ్వర్యంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు.



'సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి'

కడప మారుతీనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం కోరారు. శుక్రవారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్ఎం కార్యాలయంలో ఆర్ఎం గోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుమార్లు వినతిపత్రాలు అందించామని, అయినప్పటికీ స్పందన లేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఆర్.నారాయణ, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



కడప కలెక్టరేట్, జనవరి 249 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన ప్లాంట్ డాక్టర్స్- 2025 డైరీని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం తన చాంబరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచుకోవాలి

కమలాపురం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాల ఉత్పత్తిని పెంచుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో వారు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. ఆరోగ్య శిబిరాలు అందించే వైద్యసేవల గురించి పశు పోషకులకు అవగాహన కల్పించారు.

చిరుధాన్యాలు, ప్రాసెసింగ్ యంత్రాలపై అవగాహన

పులివెందుల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కలాశాలలో చిరుధాన్యాలపై అవగాహన, ప్రాసెసింగ్ యంత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ ఏర్పాటు చేశారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతి వారు అఖిల భారత జొన్న, చిరుధాన్యాలపై సమన్వయ పరిశోధన పథకం వారి షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక 2024-25లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. తిరుపతి నుంచి వచ్చిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలిముల్లా చిరుధాన్యాల ఉపయోగాలు, ఆవశ్యకత, పోషకాలు, యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగించారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
A.C.M.: 99854 11184

రైల్వే ఉద్యోగాలపై రేపు మోడల్‌టెస్ట్, సదస్సు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే గ్రూడ్-డి ఉద్యోగాలపై ఉచిత నమూనా పరీక్ష, అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు సృజన్స్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కె.సృజన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే గ్రూప్-డిలో 32,438 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఈ ఉద్యోగాలపై అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సుతో పాటు టాలెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. మోడల్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8099919877 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజుపాలెం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. ప్రతి డిపార్ట్‌మెంటు నుంచి అధికారులు హాజరై మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలన్నారు. అదే విధంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కూడా రావాలని తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

మైలవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని మైలవరం విద్యుత్తు శాఖ ఏఈ చిదంబర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు స్తంభాల చుట్టూ చెట్లు తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు ఉన్నందున సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

పోరుమామిళ్ల..: నేడు పోరుమామిళ్ల 132/33 కేవీ సబ్ స్టేషనులో మరమ్మతులు జరుగుతున్నందున పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు మండలాల గ్రామ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఇంజనీరు రవిచంద్రశేఖర్, సబ్ ఇంజనీరు వెంకట మహేశ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించలన్నారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల పరీక్ష

జమ్మలమడుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రేషన్ డీలర్ల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్ష సాయంత్రం మూడు గంటల నుంచి అయిదు గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల పరీక్షకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. మొత్తం 204 మందికిగాను 179 మంది హాజరయ్యారని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం ఆర్డీవో సాయిశ్రీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

గోడౌన్ బంద్

ఎర్రగుంట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ సివిల్ సప్లై ఎర్రగుంట్ల గోడౌన్ వద్ద ఏపీ హమాలీ వర్కర్స్ శుక్రవారం బంద్ నిర్వహించారు యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు ఈ బంద్ నిర్వహించినట్లు సంఘం నాయకులు తెలి పారు. పెంచిన రేట్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సుబ్బారెడ్డి, తిరుపతి,సుధాకర్,జయరాజు,హరికృష్ణ పాల్గొన్నారు.

27న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సాగు భూములు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టబోతున్న నిరసన కార్యక్రమంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేలు పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపబడుతున్న నిరసన కార్యక్రమాన్నా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేష్, సుబ్బారెడ్డి, సుధాకర్, రాజశేఖర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై లింగ వివక్ష చూపరాదు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురష్కరించుకుని రాజబాట వీధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నజీర్‌బాష, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లీశ్వరి, జయమ్మ, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

● ఆరోగ్యంకోసం బాలికలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయాలని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ త్యాగరాజారెడ్డి పేర్కొన్నారు. ఐఎంఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో జాతీయ బాలికా దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి , డాక్టర్ నమిత, హెచ్‌ఎం నాగార్జునరెడ్డి, రిటైర్డు హెచ్‌ఎం కాశీప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, నీరజలు మాట్లాడుతూ బాలికలు సమయస్ఫూర్తితో ఆలోచించి నిర్ణయాలు తీసుకొని సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు విజయలక్ష్మి, శాంతకుమారి, రమణమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు.. మాట్లాడుతున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ త్యాగరాజారెడ్డి


ఖాజీపేట..: తల్లిదండ్రులు లింగ వివక్ష చూపరాదని వైద్యాధికారి ఆయేషాసుల్తానా అన్నారు. శుక్రవారం బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ భార్గవి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్లు శోభన్‌బాబు, క్రిష్ణప్రియ, కళావతి, విద్యార్థులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: జాతీయ బాలికల దినోత్సవం ,అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా బద్వేలుపట్టణంలోని ఉర్దూ పాఠశాలలో శుక్రవారం ఉజ్వల భవిష్యత్తుకోసం బాలికలకు సాధికారతలో భాగంగా బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: బాల్య వివాహాలను అరికడదామని అంగనవాడీ టీచర్లు పిలుపునిచ్చారు. కొండాపురం రామసుబ్బారెడ్డి నగర్‌లో బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వసంత, రామతులసి, రాణి,ఆదిలక్ష్మి, సులోచన, వసంతకుమారి పాల్గొన్నారు.

మైలవరం..: బాలికల విద్యను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ హేమలత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బెస్తవేముల గ్రామ అంగన్వాడీ కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: బాలికలు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిబంధనలు పాటించాలి

జమ్మలమడుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు రోడ్డు నిబంధనలు నిర్లక్ష్యం చేయకుండా పాటించినట్లయితే ప్రమాదాలు జరుగవని జమ్మలమడుగు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ సూచించారు. శుక్రవారం జమ్మలమడుగులో ఆర్టీసీ డిపో గ్యారేజీ ప్రాంగణంలో డ్రైవర్స్ డే పురస్కరించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ డ్రైవర్లకు గులాబీ పువ్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, ఆర్టీసీ డ్రైవర్లు శివుడు, నూర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అర్బన్..: డ్రైవర్లు రహదారి సూత్రాలను తప్పకుండా పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ రోడ్డు రవాణా భద్రత మాసోత్సవాలలో భాగంగా ఉద్యోగులతో భద్రత సూక్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డ్రైవర్లకు డ్రైవర్స్ డే సందర్భంగా గులాబీ పువ్వులు ఇచ్చి గౌరవించారు.


జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ వద్ద మాట్లాడుతున్న మేనేజర్ ప్రవీణ్

ప్రొద్దుటూరు టౌన్..: రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆర్టీవో మురళీధర్ తెలిపారు. శుక్రవారం 36వ రోడ్డు భద్రత వారోత్సవాలను పురష్కరించుకుని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రవీంద్రనాయక్, హేమకుమార్, ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలు ఇవ్వాలి

జమ్మలమడుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ప్రభుత్వం, జిల్లా అధికారులు సాగు భూమి, ఇంటి స్థలాలు ఇవ్వాలని జమ్మలమడుగు సీపీఐ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం జమ్మలమడుగులోని ఆర్డీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలు సాధించేవరకు పోరాటం చేస్తామని, ఆదిశగా 27న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులు రిపబ్లిక్‌డేలో పాల్గొనాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వీర నారీమణులు 76వ రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొనాలని ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.బాలవీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో 26వ తేదీ ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని, డివిజన్ పరిధిలోని మాజీ సైనికులు, వీరనారీమణులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీబస్టాండును ఆధునికీకరణ చేస్తాం

పోరుమామిళ్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండును ఆధునీకరిస్తామని డీఎం నిరంజన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు. బస్టాండు స్లాబుకు సంబంధించిన పెచ్చులు ఊడిపోయి ఉండడాన్ని గమనించారు. త్వరలో బస్టాండు విస్తరణతో పాటు ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 11 నుంచి మధ్యాహ్నం బస్సు బయల్దేరి వయా కడప బస్టాండు మీదుగా అరుణచలం చేరుకుంటుందన్నారు. తిరిగి 12న బయల్దేరి సాయంత్రం 6గంటలకు బద్వేలు చేరుకుంటుందన్నారు. బద్వేలు నుంచి టికెట్ ధర రూ.1150, కడప నుంచి రూ.1050 ఉంటుందన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి


సీఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఎర్రగుంట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ 1535 నాయకులు ఏపీ సీఎస్ విజయానంద్, ఎండీ చక్రధర్‌బాబును కలిసి శుక్రవారం వినతిపత్రాన్ని ఇచ్చారు. అధికారులను కలిసిన వారిలో యూనియన్ నాయకులు ఏ.శ్రీనివాస్‌కుమార్, వి.రామక్రిష్ణారెడ్డి, ఎన్.రమణయ్య, మహేశ్వరరెడ్డి, ఆర్.జనార్దన్‌రెడ్డి, రాధాక్రిష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

జమ్మలమడుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు మీటర్ రీడర్స్ కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని గూడెం చెరువు గ్రామంలో అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. అక్కడే సీతారాముల గుడి ప్రతిష్ఠ 41వ రోజు పురస్కరించుకుని భూపేశ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


ఈశ్వరీదేవి మఠంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరీదేవి మఠంలో మఠాధిపతులు వీర శివకుమారస్వామి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కొవ్వూరు వాస్తవ్యులు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి భక్తబృందం సభ్యులు శుక్రవారం ఈశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా భక్త బృందం మాట్లాడుతూ శుక్రవారం నుంచి జనవరి 26 వరకు మూడురోజుల పాటు ఈశ్వరీదేవి అమ్మవారి మఠంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమం ఉంటుం దన్నారు. కార్యనిర్వాహణాధికారి బీవీ జగన్మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు ఘనంగా చేపడుతున్నారు.

నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు



అట్లూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంభగిరి గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించినట్లు పశువైద్యాధికారి శిరీషా తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కేంద్రం, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల పెంపకంపై డాక్టర్ శివరామిరెడ్డి వివరించారు. చలికాలంలో 41 రోజుల లేగదూడలకు నట్టల నివారణ చర్యల గురించి, లింగ నిర్ధారణ వీర్య కృత్రిమ గర్భధారణ గురించి పాడి రైతులకు వివరించారు. నేటి లేగదూడలే రేపటి పాడిపశువులన్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంగా పెంచిన లేగదూడల పాడి రైతులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప డివిజను సహాయ సంచాలకుడు శ్రీనివాసులరెడ్డి, సిద్దవటం సహాయ సంచాలకుడు శ్రీలక్ష్మీదేవి, గోపాలమిత్ర వెంకటసుబ్బయ్య, సిబ్బంది సంటెయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు ఆర్టీవో మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు మేరీకుమార్, కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ పట్టణంలో పాఠశాలలు, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలకు చెందిన కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ లేదని, పరిమితికి మించి విద్యార్థులతో బస్సులు వెళుతున్నా రవాణా శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చిన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

జమ్మలమడుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని పీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇంగ్లీషు టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు రమణారెడ్డి, చంద్రశేఖర్‌రావు, చౌడయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముద్దనూరు జనవరి24(ఆంధ్రజ్యోతి):మండల పరిధి చిన్నకత్తెర పల్లె గ్రామ చీనీచెట్లలో శుక్రవారం పేకాట ఆడుతున్న 5 గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.రాబడిన సమాచారం మేరకు దాడి చేసి జూదరులను, రూ.20,200 నగదు, పేకలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సెలవుల పనివేళలు అమలు చేయండి

కమిషనర్‌కు శానిటేషన్ సెక్రటరీల విన్నపం

ప్రొద్దుటూరు,జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు ప్రభుత్వ సెలవులతో పాటు పనివేళలు అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగ సంఘం తాలుకా అధ్యక్షుడు ప్రభాకర్‌రావు కార్యదర్శి రామచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు తమ డిమాండ్లపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం, రెండో శనివారం సెలవులు ఇవ్వలన్నారు. క్యాజువల్ లీవ్స్‌ను ఇతర సచివాలయ సెక్రటరీల వలే సులభతరం చేయాలన్నారు. జీవో నెం 423 ను రద్దు చేసి ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలు అమలు చేయాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో శానిటేషన్ సెక్రటరీలు ఉన్నారు.

ముగిసిన లింగమయ్యస్వామి తిరునాళ్లు

కొండాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో లింగమయ్యస్వామి తిరునాళ్ల ముగిసింది. గురు, శుక్రవారాలలో జరిగిన తిరునాళ్లలో లింగమయ్యస్వామి,పెద్దమ్మ, అంకాళమ్మకు బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా జనం పెద్ద ఎత్తున తిరునాళ్లకు తరలివచ్చారు. రెండో రోజు శుక్రవారం చద్ది తిరునాళ్ల జరిగింది..రంగులరాట్నాలు, పెద్దఎత్తున చెరుకుల బండ్లు ఆకర్షణగా నిలిచాయి.

'దళితుల భూములకు రక్షణ లేదు'

జమ్మలమడుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల భూములు అనుభవంలో ఉన్నప్పటికీ లేనట్లుగా అధికారులు ఆన్‌లైన్‌లో నుంచి పేర్లు తొలగించడం దారుణంగా ఉందని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వలన బడుగు, బలహీన వర్గాలపై, స్థలాలు, భూములపై అన్యాయం జరుగుతోందన్నారు. అంతేకాక వారిపై మానసిక దాడులు, భౌతిక దాడులు జరుగుతున్నాయని, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ఇలాంటి సమస్యలపై దృష్టి సారించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

ముద్దనూరు జనవరి24(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి పెనికెలపాడు గ్రామాన్ని పైలెట్ విలేజ్ కింద్ర ఎంపిక చేశారు. అందులో భాగంగా శుక్రవారం భూముల రీసర్వేను రెవెన్యూ అధికారులు చేపట్టారు.

రైతు ఆత్మహత్య

బద్వేలుటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లెకు చెందిన బిజివేముల చెన్నారెడ్డి (48) అనే రైతు పురుగుల మందుతాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు చెన్నారెడ్డి అప్పులబాధతాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మైలవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో జనవరి 30, 31 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జర్మియా అన్నారు. శుక్రవారం మైలవరంజడ్పీ హైస్కూలు ఆవరణంలో ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, నిరంజన్, శంకర్ పాల్గొన్నారు.

బ్రిడ్జి కూలడంతో గ్రామంలో రాకపోకలు బంద్

బ్రహ్మంగారిమఠం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరివారిపల్లె గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా బ్రిడ్జీ కూలి నీళ్లలో పడింది. అక్కడ నుంచి పలుగురాళ్లల్లె, జౌకుపల్లె, సిద్దయ్యగారిమఠం, గొడ్లవీడు గ్రామాలకు ప్రజలు నిత్యం వెళుతుంటారు. సిద్దయ్యగారిమఠం వెళ్లడానికి ఆ గ్రామం నుంచే భక్తులు వెళుతుంటారు. బ్రిడ్జీ ఒక్కసారిగా కూలడంతో గ్రామంలో రాకపోకలు బంద్ అయ్యాయి. వెంటనే అధికారులు పత్యామ్నాయ చర్యలు చేపట్టి త్వరగా బ్రిడ్జీని ఏర్పాటు చేయాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.


చౌదరివారిపల్లెలో కూలిన బ్రిడ్జి

వరిపొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

ఎర్రగుంట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదండ్లూరు పరిసరాల్లో సాగుచేసిన వరిపొలాలను వ్యవసాయ సహాయ సంచాలకుడు ఏవీ.నరసింహారెడ్డి, ఏవో శ్రీకాంత్‌రెడ్డి తదితరులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. వరి పొలాలు వాతావరణ పరిస్థితుల వల్ల, జింకు ధాతువు లోపం వలన పంట ఎదుగుదల చాలా తక్కువగా ఉందన్నారు. దీని నివారణ కోసం తీసుకోవాల్సిన తగు సూచనలను వారు రైతులకు తెలియజేశారు. రబీ పంటలైన శనగ,మినుము, నువ్వులు, వరి, పెసర పంటలకు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 A.C.M. : 99854 11184